కేసీఆర్‌ను కలిసిన జీసీసీ మాజీ చైర్మన్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్ వాల్యానాయక్ దంపతులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బుధవారం కలిశారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆయనను కలిసి తన కుమారుడు అరుణ్‌కుమార్ వివాహ ఆహ్వాన పత్రికను వారు అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తండాబాట కార్యక్రమం సందర్భంగా కేసీఆర్ వాల్యానాయక్ నివాసంలో బస చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 18న హయత్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో వివాహం, శంషాబాద్‌లో రిసెప్షన్‌ను ఏర్పాటు చేసినట్టు ఈ సందర్భంగా వాల్యానాయక్ కేసీఆర్‌కు వివరించారు. వాల్యానాయక్ వెంట మాజీ ఎంపీపీ కమల, ఆయన కుటుంబసభ్యులు జేవేందర్, ఆనంద్‌నాయక్, అరుణకుమార్, అనిత ఉన్నారు.

సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి: సీఎస్

హైదరాబాద్,ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు కలెక్టర్లు పటిష్ఠమైన నిఘా ఉంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ ప్రగతిని సమీక్షించారు. కలెక్టర్లతోపాటు జిల్లాలోని ఇతర ఉన్నతాధికారులు అన్ని పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు సోకే జ్వరాల నివారణకు సకాలంలో స్పందించాలని, తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. ఆహారం, పారిశుధ్యాన్ని కూడా తనిఖీ చేయాలని తెలిపారు.

ప్రతిగడపకూ స్వాతంత్య్ర ఫలాలు చేరాలి

మొదటిపేజీ తరువాయి...

పోరాట స్ఫూర్తితో శాంతియుతమార్గంలో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, ప్రజల సహకారంతో పదేండ్ల అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో సబ్బండ వర్గాల అభ్యున్నతి దిశగా దేశ పాలకులు కార్యాచరణను మరింత చిత్తశుద్ధితో అమలు చేయాలని, ఆ ఫలితాల సాధన ద్వారానే స్వాతంత్య్ర పోరాట త్యాగధనులకు మనం అర్పించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ • 44 మంది కుటుంబాలకు బీమా సొమ్ము అందజేత



హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం ములుగు నియోజకవర్గం చంచుపల్లె గ్రామానికి చెందిన మానసకు, దుబ్బాక నియోజకవర్గం పెద్ద గుండవల్లి గ్రామానికి చెందిన మల్లవ్వకు బీమా మంజూరుపత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ తెలిపారు. ఇటీవల మరణించిన 44 మంది పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున బీమా క్లెయిమ్ సొమ్ము మంజూరు పత్రాలను బుధవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. పార్టీ కార్యకర్తలు చనిపోతే వారి కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు పార్టీ అధినేత కేసీఆర్ కార్యకర్తలందరికీ ఇన్సూరెన్స్ చేయించాలని నిర్ణయించినట్టు తెలిపారు. కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల సాయం అందించే విధంగా పార్టీ బీమా ప్రీమియం చెల్లించిందని తెలిపారు. ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా దరకాస్తులను ఇన్సూరెన్స్ కంపెనీలకు పంపి, వాటి ఆమోదం రాగానే బీమా మంజూరు పత్రాన్ని అందిస్తారని, ఆ తర్వాత రెండు లక్షల చెక్కును మృతిచెందిన పార్టీ కార్యకర్త ఇంటికెళ్లి పార్టీ ముఖ్య నేతలు అందిస్తారని తెలిపారు. చనిపోయిన ఎందరో కార్యకర్తల కుటుంబాలకు ఈ బీమా సొమ్ముతో మేలు జరిగిందని తెలిపారు.

లోకం పోకడ

హరీశ్ మాటల్లో తప్పేమున్నది?

- ఉన్నమాటంటే ఉలుకెందుకు?
- 'సీతారామ' సహా అన్ని అంశాలపై బహిరంగ చర్చకు మేము సిద్ధం
- జీవో 33ను వెంటనే రద్దు చేయాలి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజం

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో భిక్షమయ్యగౌడ్, చింతల

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : 'సీతారామ ప్రాజెక్టుపై హరీశ్‌రావు అన్న మాటల్లో తప్పేమున్నది?, ఉన్నమాటంటే ఉలుకెందుకు? ఓ మంత్రి కంటతడి పెట్టడం ఎందుకు?.. హరీశ్ మాట్లాడిన దాంట్లో అభ్యంతరకర పదాలు ఏమున్నయ్?' అంటూ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. సీతారామ సహా అన్ని అంశాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి ఒక్క లేఖయినా రాసిందా? అంటూ నిలదీశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, తుంగ బాలుతో కలిసి జగదీశ్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయని, కిరణ్ కుమార్‌రెడ్డికంటే బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే సీతారామ పనులు దాదాపుగా పూర్తయ్యాయని, కనీసం బటన్ నొక్కేప్పుడైనా కేసీఆర్ కష్టం గురించి చెప్పాలని మంత్రులను కోరామని తెలిపారు. 'గురుకులాల్లో పరిస్థితులకు కూడా కేసీఆర్ కారణమని భట్టి అంటున్నారు.. ఇంతకన్నా దారుణం ఉంటుందా?, రోజూ మీరు పళ్లు తోముకోకుంటే కూడా కేసీఆర్‌దే బాధ్యతనా?' అంటూ ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా ఇంకా బీఆర్ఎస్ మీదే ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతున్నదని, ఇప్పటి కోసం తొమ్మిది నెలల కిందే వండిపెట్టాల్సి ఉండేనా? అంటూ దుయ్యబట్టారు. ఉత్తమ్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, కనీసం అధికారులతో ఆయన మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టుపై కేసీఆర్ ప్రభుత్వం 2018 నుంచి 2022 దాకా వరుసగా కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపితే ఈ అనుమతులు వచ్చాయని, కాంగ్రెస్ వచ్చాక సీతారామ సహా ఏ ప్రాజెక్టు కోసమైనా కేంద్రానికి ఒక్క ఉత్తరమైనా రాసిందా? అని నిలదీశారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతపై తప్పటడుగు వేసి బీఆర్ఎస్ ఒత్తిడితో వెనక్కి తగ్గారని, కాంగ్రెస్ హయాంలో లాగా కేసీఆర్ పాలనలో ఏ ప్రాజెక్టు అంచనాలను కూడా పది, పదిహేను రెట్లు పెంచలేదని గుర్తుచేశారు. కమీషన్లు ఇవ్వడం, తీసుకోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటని, కాలువలు తవ్వక ముందే మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదని, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు పదహారు చోట్ల కొబ్బరికాయలు కొట్టినా పనులు జరిగాయా? అంటూ నిలదీశారు. కేసీఆర్ పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారని, కాంగ్రెస్ నేతలు ఇంకా చంద్రబాబు, వైఎస్సార్ భజన చేస్తున్నారని దుయ్యబట్టారు. వాళ్లిద్దరూ తెలంగాణలో ఒక్క ఎకరానికైనా నీళ్లిచ్చారా? అని ప్రశ్నించారు. వైఎస్సార్ హయాంలో ఆంధ్రా, రాయల సీమ ప్రాజెక్టులు పూర్తయ్యాయని, తెలంగాణ ప్రాజెక్టులు పెండింగ్‌లో పడ్డాయని, రాయలసీమకు 350 టీఎంసీల సామర్థ్యమున్న ప్రాజెక్టులను పూర్తి చేశారని, తెలంగాణకు ఏం చేశారని, వైఎస్, చంద్రబాబు హయాంలో తెలంగాణలో మూడున్నర క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఒక్క చెరువునైనా కట్టారా? అంటూ నిలదీశారు. 'ఎవరి హయాంలో తెలంగాణ ప్రాజెక్టులు పూరయ్యాయో చర్చించేందుకు ఉత్తమ్ గాని, భట్టి గాని వస్తారా? వారు ఎక్కడికి రమ్మన్నా మేం సిద్ధం' అంటూ సవాల్ విసిరారు. నీళ్లిస్తే వడ్లు పండుతాయని, వడ్లు పండితే ఎక్కడ బోనస్ ఇవ్వాల్సి వస్తుందోన్న భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం ఉన్నా సాగునీరు ఇవ్వడం లేదని విమర్శించారు . తెలంగాణ పాలిట ద్రోహులెవరో, దొంగలెవరో తేలాల్సిందేనని చెప్పారు. ఎస్ఆర్‌బీసీ, ఎస్ఎల్‌బీసీ ఒకేసారి మొదలైతే ఎస్ఆర్‌బీసీ పూర్తయ్యింది గాని, ఎస్ఎల్‌బీసీ ఇంకా పూర్తి కాలేదని, ఎస్ఎల్‌బీసీపై కాంగ్రెస్ మంత్రులు హంతకులే సంతాప సభ పెట్టినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టుపై మంత్రులు మాట్లాడిన ప్రతీదీ అబద్ధమేనని, వారి మాటలపై ఎక్కడైనా చర్చకు తాము సిద్ధమేనని జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ సోయి లేదని, తెలంగాణలోనే తెలంగాణ బిడ్డలను స్థానికేతరులను చేసే విధంగా జీవో 33 తెచ్చిందని, తెలంగాణకు ఇంతకన్నా ద్రోహం మరోటి ఉంటుందా అని ప్రశ్నించారు. రేవంత్ తన ఆంధ్రా మిత్రులనో, చంద్రబాబునో సంతృప్తి పరిచేందుకే జీవో 33 తెచ్చారా? అని నిలదీశారు. ఇప్పటికైనా సోయి తెచ్చుకొని జీవో 33ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.7°c	23.5°c
రంగారెడ్డి	37.0°c	23.1°c
మెదక్	36.8°c	23.6°c
నిజామాబాద్	33.3°c	24.9°c
కరీంనగర్	33.0°c	26.0°c
హైదరాబాద్	32.2°c	26.1°c
మహబూబ్‌నగర్	32.0°c	23.0°c
నల్లగొండ	32.0°c	24.4°c
ఖమ్మం	31.0°c	25.0°c
వరంగల్	26.0°c	22.0°c

ఏడు రోజులపాటు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా ఏడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో వచ్చే నాలుగైదు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో అత్యధికంగా 6.67 సెం.మీ, చిన్నగూడురులో 4.36 సెం.మీ, నర్సింహులపేటలో 2.83 సెం.మీ, దంతాలపల్లిలో 2.79 సెం.మీ, రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో 3.96 సెం.మీ, నల్లగొండ జిల్లా గుర్రంపోడులో 3.49 సెం.మీ, గట్టుప్పల్‌లో 3.13 సెం.మీ, యాదాద్రి-భువనగిరి జిల్లా నారాయణపూర్‌లో 2.64 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

అవమానించబోయి..

మొదటిపేజీ తరువాయి...

ఆహ్వాన పత్రిక సిద్ధం చేసింది. ఇందులో మాజీ సీఎం కేసీఆర్‌కు హోదాకు తగిన ప్రాధాన్యం దక్కలేదు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు పాల్గొంటున్నట్టు అందులో పేర్కొన్నారు. మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహను విశిష్ట అతిథులుగా ప్రస్తావించారు. ప్రతిపక్ష నేతగా, క్యాబినెట్ ర్యాంకుకు సమాన హోదా ఉన్న కేసీఆర్ పేరును ఆహ్వాన పత్రికల్లో సాధారణ ఎమ్మెల్యేల వరుసలో చేర్చారు. పైగా 'గజ్వేల్ శాసన సభ్యులు' అని మాత్రమే సబోధించారు. ఈ నిర్ణయంపై అటు రాజకీయ పక్షాల నుంచి, ఇటు నిపుణుల నుంచి, సోషల్ మీడియాలో నెటిజన్లు నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రభుత్వ సలహాదారుకన్నా ప్రధాన ప్రతిపక్ష నేత హోదానే పెద్దదని గుర్తు చేశారు. పైగా మాజీ సీఎం, ప్రస్తుత ప్రధాన ప్రతిపక్ష నేత కాబట్టి మంత్రులతో సమానంగా హోదా కల్పించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రొటోకాల్ నిబంధనలను పరిశీలించాలని సూచించారు. క్యాబినెట్ మినిస్టర్లకు సమాన స్థాయిలో మాజీ ప్రధానులు, రాజ్యసభ, లోక్‌సభలో ప్రతిపక్ష నేతలకు గౌరవం ఇవ్వాలని నిబంధనల్లో ఉన్నాయని గుర్తు చేశారు. సంబంధిత పత్రాలను షేర్ చేశారు. ప్రభుత్వం యథేచ్ఛ గా, ఉద్దేశపూర్వకంగానే నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్టు స్పష్టం అవుతున్నదని మండిపడ్డారు.

నాలుక కరుచుకున్న ప్రభుత్వం

కేసీఆర్‌కు గౌరవం దక్కకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకున్నది. ఆహ్వాన పత్రికల్లో మార్పులు చేసింది. కేసీఆర్ పేరును విశిష్ట అతిథుల జాబితాలో చేర్చింది. ముఖ్య అతిథిగా కేకేను పేర్కొంటూ.. ఆ తర్వాతి స్థానంలో కేసీఆర్ పేరును మార్చింది. 'తెలంగాణ రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకులు' అనే హోదాను కూడా చేర్చింది. అయితే, ముందుగా బయటకు వచ్చిన ఆహ్వాన పత్రిక అసలుది కాదని జిల్లా అధికారులు సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. దీంతో మొదట వచ్చింది అసలుది కాకపోతే.. డిజైన్, అక్షరాలు, రంగులు, పేర్లు, పరిమాణం అచ్చు గుద్దినట్టు ఎలా ఉన్నాయని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించి నవ్వులపాలు కావొద్దని సూచిస్తున్నారు.

భద్రాద్రి జిల్లా మణుగూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

నేడైనా నిజం ఒప్పుకోండి

Iవ పేజీ తరువాయి...

చేసిందేమీలేదని స్పష్టంచేశారు. కానీ కేసీఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించినట్టుగా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 'సీతారామ నీళ్లొచ్చే వరకు ఉద్యమిస్తాం

ప్రాజెక్టుకు డిజైన్ చేసిందెవరు? కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్ని? కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్ని? ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్ర ఎంత? కాంగ్రెస్ ప్రభుత్వం పాత్ర ఎంత? సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్న మూడు మోటర్లు బిగించింది బీఆర్ఎస్ ప్రభుత్వమా? కాంగ్రెస్ ప్రభుత్వమా?' వంటి అనేక విషయాలను ఉమ్మడి జిల్లా ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒకే విడతలో రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పూర్తి స్థాయిలో మాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్నదని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ 40 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ, డీసీసీబీ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరందాలి

ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీరు వచ్చేవరకు ఉద్యమిస్తామని స్థానిక మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రియానాయక్, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌లు మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లా మీదుగా గోదావరి నది ప్రవహిస్తుండటంతో ఆ నీటిని జిల్లాలోని ప్రతీ ఎకరాకు పారించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి నిర్మించారని తెలిపారు.

బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు. చిత్రంలో జడ్పీ, డీసీసీబీ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషయ్య

భద్రాద్రికి నీళ్లివ్వని సీఎంకు పూసుగూడెంలోనే బుద్ధిచెప్తాం

పినపాక నియోజకవర్గం, భద్రాద్రి జిల్లా రైతులకు సీతారామ నీళ్లివ్వకుండా అన్యాయం చేస్తున్నపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పూసుగూడెంలోనే బుద్ధి చెప్తామని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు హెచ్చరించారు. భద్రాద్రి జిల్లాలోని పినపాక నియోజకవర్గానికి చెందిన సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఇక్కడి రైతులకు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు వారి నియోజకవర్గాలకు తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ భద్రాద్రి జిల్లా మణుగూరులో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బుధవారం ఆయన పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. ఈ ప్రాజెక్టు నీళ్లను ఖమ్మం జిల్లా మంత్రులు తమ నియోజకవర్గాలకు తీసుకెళ్లాలని చూడటం సిగ్గుచేటని విమర్శించారు. సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ ప్రకారం తొలుత స్థానిక రైతులకు, ముఖ్యంగా భద్రాద్రి జిల్లా రైతులకు నీళ్లు ఇవ్వాలని, ఆ తరువాతే ఖమ్మం జిల్లాకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోశం నర్సింహారావు, అడపా అప్పారావు, ముత్యం బాబు, వట్టం రాంబాబు పాల్గొన్నారు.

ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు తమ స్వార్థం కోసం సీతారామ నీటిని భద్రాద్రి జిల్లాకు కాకుండా.. ఖమ్మం జిల్లాకు తరలించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి నీటిని పక్క జిల్లాకు తరలిస్తే ఊరుకునేది లేదని, రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోడ బాలు, తాతా గణేశ్, బానోత్ రామ, కిషన్, జాలాది అప్పారావు, లాలు, కిరణ్, శివకృష్ణ, రవి, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నేడు సీఎం పర్యటన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయినిగా నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన పలు పంప్‌హౌజ్‌లను ప్రారంభించి వైరాలో ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా సాగునీటిని విడుదల చేయనున్నారు. వైరా వేదికగా రూ.2 లక్షల రైతు రుణమాఫీ మూడోవిడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

తీర్పునకు లోబడే ఎమ్మెల్సీ నియామకాలు

- స్టే విధిస్తూనే షరతు పెట్టిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాల కేసులో సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. ఎమ్మెల్సీల నియామకాల ప్రక్రియను కొనసాగిస్తే అవి తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉండాలని షరతు విధిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లను బుధవారంజస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. కోర్టు తుది ఆదేశాలు ఇచ్చే వరకూ హైకోర్టు ఆదేశాలపై యథాతథ స్థితి (స్టేటస్ కో) ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. స్టేటస్ కో కాదని, స్టే ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు చెప్పగా అందుకు సిబల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. స్టే ఇస్తే తిరిగి ఎమ్మెల్సీల నియామకాలు చేసే అవకాశం ఉన్నదని సుప్రీం ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. శాసనమండలి సభ్యులుగా దాసోజు, కుర్రను నియమించేందుకు గవర్నర్ నిరాకరించారని, రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా గవర్నర్ చర్యలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో స్టే ఇస్తే పిటిషనర్లను కాకుండా గవర్నర్ వేరే వారిని ఎమ్మెల్సీలుగా నియమించే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫార్సు చేసిన ఇద్దరు వ్యక్తుల నియామక గెజిట్‌ను కూడా తెలంగాణ హైకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. ఆ ఇద్దరినే నియమించేందుకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని సిబల్ అన్నారు.

అయాచితం శ్రీధర్‌కు సబిత పరామర్శ



అయాచితం శ్రీధర్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, ఆగస్టు 14: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్‌ను బుధవారం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పరామర్శించారు. హైదరాబాద్ కొత్తపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో ఉన్న ఆయన మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నేతలు అరవిందశర్మ, నగేశ్, రామనర్సింహ, సాజిద్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కళ్లెం వేస్తున్న పెద్దలెవరు?

మొదటిపేజీ తరువాయి...

విస్తీర్ణంలో భూములు ఉండగా.. ఇందులో పలు సంస్థలకు చెందిన భూములు కూడా ఉన్నాయి. వాటికి సంబంధించి ఎలాంటి వివాదం లేదు. కానీ, నాగన్‌పల్లి పరిధిలోని లావుని పట్టా భూముల్లో రహదారుల నిర్మాణం చేపట్టడంతో వివాదం నెలకొన్నది. నిబంధనలకు ఇది విరుద్ధం కావడంతో రెవిన్యూ శాఖ అధికారులు 11.36 ఎకరాల విస్తీర్ణంలోని పలువురు రైతులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ భూములను నిబంధనలకు విరుద్ధంగా బదలాయింపు చేసినందున పదిహేను రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఈ నెల 7న నోటీసులు ఇచ్చారు. గడువు తీరిన తర్వాత భూములు స్వాధీనం చేసుకుంటామని చెప్తున్నారు. కానీ, అనాజిపూర్ గ్రామ పరిధిలోని సీలింగ్ పట్టాల వ్యవహారంలో రెవిన్యూ శాఖ స్పందించకపోవడం విస్మయానికి గురి చేస్తున్నది. ఈ గ్రామ పరిధిలోని పలు సర్వే నంబర్లలో 586 ఎకరాల భూమి ఉంటే, అందులో సీలింగ్ పట్టా 146.35 ఎకరాల వరకు ఉన్నది. వీటిని గతంలోనే ప్రభుత్వం నిరుపేద రైతులకు పంపిణీ చేసింది. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు జరిగాయనే ఆరోపణలున్నాయి. వీటిపై రెవిన్యూ శాఖ అధికారులు దృష్టిసారించడం లేదు. పట్టా భూముల నెపంతో సీలింగ్ భూముల వైపు ఎవరినీ వెళ్లనీయడంలేదని పలువురు రైతులు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఈ భూముల్లో భారీ యంత్రాలతో చదును చేసేందుకు చేపడుతున్న పనులతో వచ్చే మట్టి, పెద్ద పెద్ద రాళ్లను ఇందిరాసాగర్ బఫర్ జోన్ పరిధిలో వేస్తున్నారనే అంశంపై అధికార యంత్రాంగం దృష్టిసారించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. నీటిపారుదల శాఖ అధికారులుగానీ, హైడ్రాగానీ ఇప్పటివరకు ఇందిరాసాగర్ పరిరక్షణకు చర్యలు తీసుకోలేదంటే తెర వెనక పెద్దల ఒత్తిళ్లు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీతో వెలుగులోకి నకిలీ పట్టాలు

ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి అసైన్డ్ భూముల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. సర్వే నంబరు 189లో 179.33 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇందులో గతంలోనే నాగన్‌పల్లి గ్రామానికి చెందిన సుమారు 60 మంది రైతులకు ప్రభుత్వం 120 ఎకరాల విస్తీర్ణంలో పట్టాలు పంపిణీ చేసింది. మరో 59.33 ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నది. ఆ ఖాళీ భూములకు సంబంధించి గతంలోనే భారీఎత్తున నకిలీ పట్టాల పంపిణీ జరిగిన వ్యవహారం తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలోనే నకిలీ పట్టాల పంపిణీ జరగ్గా... ఆ రైతుల పేర్లు రెవిన్యూ రికార్డుల్లోకి కూడా ఎక్కాయి. దీంతో వారికి పాసు పుస్తకాలు జారీ కావడంతో వారంతా బ్యాంకు రుణాలు తీసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2014లో రుణమాఫీ చేసింది. ఆ సందర్భంగా భూమిలేని వారి పేర్లు రుణమాఫీ జాబితాలో ఎందుకు ఉన్నాయంటూ నాగన్‌పల్లి గ్రామస్తులు ఆరా తీయడంతో నకిలీ పట్టాల వ్యవహారం వెలుగు చూసింది. వెంటనే గ్రామస్తులు అప్పటి కలెక్టర్ రఘునందన్‌రావుకు ఫిర్యాదు చేయగా ఆయన విచారణకు ఆదేశించారు. నకిలీ పట్టాల పంపిణీ నిజమని తేలడంతో పలువురు రైతుల పట్టాలను రద్దు చేయడంతోపాటు అప్పటి వీఆర్వో రఫీక్‌ను సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా రద్దు చేసిన వారిలో నిజమైన రైతులు కూడా ఉన్నామంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. ఇప్పటికీ ఆ వ్యవహారం కోర్టులో పెండింగ్‌లోనే ఉన్నది. అయితే వంద అడుగుల రహదారి నిర్మాణం తెరపైకి వచ్చినప్పుడు ఇద్దరు రైతులు ఆ భూమి తమదంటే తమది అంటూ ఘర్షణకు దిగారు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.